
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 5

సోమవారం 8 సెప్టెంబరు 2025



ఫిజియోథెరపీతో సాంత్వన 7

మార్కెట్‌కు తీసుకొచ్చిన ఉల్లి మొత్తం కొనుగోలు చేస్తాం

● కలెక్టర్ రంజిత్‌బాషా

నేడు కర్నూలుకు వైఎస్ షర్మిల



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా రైతులకు మద్దతు తెలిపేందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలుకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిటీ ప్రెసిడెంట్ షేక్ జిలానీబాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పార్టీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. అక్కడి నుంచి కొత్త బస్టాండ్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు. అనంతరం ఉల్లి రైతులను పరామర్శించి పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించే వరకు రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రైతులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉల్లిపై వైసీపీ రాజకీయం

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపై వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని పరిశ్ర మల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉల్లి రైతులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారన్నారు. ప్రభుత్వం క్వింటాం ఉల్లిని రూ.1,200కు కొనుగోలు చేస్తుందని, ఇదివరకే సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు ఈవిషయంలో రాజకీయం చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులకు నష్టం లేకుండా చూసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు పని లేకుండా కేవలం రైతులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పై బురదజల్లేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎలాంటి సమస్య లేకున్నా ఏదో ఉన్నట్లు సృష్టించడంలో వైసీపీ నాయకులు ఆరితేరారని ఎద్దేవా చేశారు. పేపర్ ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు



తనిఖీ చేస్తున్న డీఆర్వో

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన ఫారెస్టు సబార్డినేట్ సర్వీస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయని డీఆర్వో వెంకట నారాయణమ్మ తెలిపారు. జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన సెషన్స్‌లో 12,919 అభ్యర్థులకు గానూ 10,820 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడు పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన సెషన్స్‌లో 2,255 మంది అభ్యర్థులకు గానూ 1,831 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.



కర్నూలు మార్కెట్ యార్డులో రూ.2 కోట్లు ఖర్చు చేసి అసంపూర్తిగా వదిలేసిన ఉల్లి శీతల గిడ్డంగులు

కోల్డ్ స్టోరేజీకి మోక్షమెన్నడో..?

● రూ.5 కోట్లతో ఉల్లి శీతల గిడ్డంగి నిర్మాణానికి శ్రీకారం

● సామర్థ్యం 5 లక్షల మెట్రిక్ టన్నులు

● వైసీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన వైనం

● నిర్మాణం పూర్తయి ఉంటే ఉల్లి రైతులకు వరం

ఉల్లి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధరలు పతనమై పంట దిగుబడులు రోడ్లపై పారబోసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ కష్టాలు తీరాలంటే ధర లేనప్పుడు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేయాలి. ధర ఉన్నప్పుడు అమ్ముకొని రైతు లాభ పడాలనే సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంలో శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజీ) నిర్మాణం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఎఫ్) నిధులు రూ.5 కోట్లు ఇచ్చింది. సగం పనులు పూర్తి అయ్యాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఐదేళ్లు అసంపూర్తిగా వదిలేశారు. గత పాలకుల నిర్లక్ష్యం ఉల్లి రైతులకు శాపమై వెంటాడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పనులు చేపట్టలేదు. ఆనాడే శీతల గిడ్డంగి నిర్మాణం పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఉల్లి పంట అమ్ముకోవడానికి రైతులకు ఇన్నీ కష్టాలు వచ్చేవా..? కోల్డ్ స్టోరేజ్ గోదాములో నిల్వ చేసి ధర వచ్చినప్పుడే అమ్ముకునే అకాశం ఉండేది. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులు రోజువారి (రెగ్యులర్)గా పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, వాము, కంది.. వంటి పంట ఉత్పత్తులు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ యార్డులో సీజన్‌లో టమోటా క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. ఆలూరు, మంత్రాలయం (కోసిగి), కోడుమూరు మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయాలు జరగడం లేదు. ఆయా మార్కెట్లలో ప్రతి ఏటా సరాసరి రూ.3,500 కోట్ల నుంచి రూ.4,500 వేల కోట్ల వరకు విలువైన పంట ఉత్పత్తులు రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఒక శాతం సెస్సు రూపంలో ఈ ఏడాది రూ.35-45 కోట్లు ఆదాయం వస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి క్రయవిక్రయాలకు ప్రసిద్ధి. అయితే.. రెండేళ్లకు ఒకసారి ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2022, 2023లో ఉల్లి ధరలు పడిపోయాయి. గత ఏడాది క్వింటా రూ.5 వేలకు పైగా పలికింది. ఈ ఏడాది పూర్తిగా పతనమై రూ.450 నుంచి రూ.500కు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. దశాబ్దాలుగా ఉల్లి రైతులు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ కష్టాలు తీరాలంటే పంట నిల్వ చేసుకోవడానికి శీతల గిడ్డంగులు ఎంతో అవసరం.

రూ.5 కోట్లు.. 5 లక్షల టన్నుల సామర్థ్యం

కర్నూలు మార్కెట్ యార్డుకు ఏటా రూ.850-900 కోట్లు విలువైన వ్యవసాయ పంట దిగుబడులు రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొస్తున్నారు. రూ.8.5 కోట్లు వరకు సెస్సు రూపంలో మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. అందులో ఉల్లి విక్రయాలు ద్వారానే ఏడాదికి రూ.1.50-2 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. రాయలసీమ జిల్లాల్లో ఏకైక ఉల్లి మార్కెట్ ఇది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు, సరిహద్దున తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఉల్లి దిగుబడులు తీసుకొస్తున్నారు. గిట్టుబాటు ధర లేక.. లారీ బాడుగులు కూడా గిట్టుబాటు కాక రైతులు ఉల్లిని రోడ్లపై పారబోసిన వెళ్లిన సందర్భాలు లేకపోలేదు. మద్దతు ధర లేనప్పుడు ఉల్లి నిల్వ చేసి.. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2016-17లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి దిగుబడులు నిల్వ చేసేందుకు వీలుగా శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజ్) నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్డీఎఫ్) నిధులు రూ.5 కోట్లు మంజూరు చేసింది. రూ.2.40 కోట్లు ఖర్చు చేసి సగానికి పైగా పనులు పూర్తి చేశారు. గోడలు, శీతలీకకరణ పనులు చేపడితే సరిపోతుంది. అదే జరిగితే ఉల్లి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పనులు పూర్తయ్యే దశలో ఉండగా, 2019లో టీడీపీ ప్రభుత్వం స్థానంలో వైసీపీ ప్రభుత్వం కొలుదీరింది. ఈ పనులు చేస్తే ఎక్కడ చంద్రబాబుకు రైతుల్లో మంచి పేరు వస్తుందో..? అని జగన్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేశారు. ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు నెలల క్రితం 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు రూ.5 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. నిధులు వస్తాయా..? పనులు మొదలు పెడుతారా..? అన్నది ప్రశ్నార్థకమే.

ప్రతిపాదనలు పంపించాం

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి శీతల గిడ్డంగులు అసంపూర్తిగా ఉన్న మాట నిజమే. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. బ్యాలెన్స్ పనులు పూర్తి చేయడానికి రూ.5 కోట్లు నిధులు అవసరం ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలు మొదలు పెడుతాం.

● జయలక్ష్మి, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, కర్నూలు మార్కెట్ యార్డు

శీతల గిడ్డంగితో తీరుతున్న రైతుల కష్టాలు

ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ. దీంతో ఎప్పటికప్పుడు గ్రేడింగ్ చేయాల్సి ఉంటుంది. ఏ రోజు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చే ఉల్లిని అదే రోజు కొనుగోలు చేసి వ్యాపారులు బహిరంగ వ్యాణిజ్య మార్కెట్లకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. రెండు మూడు రోజులు ఆగిపోతే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసే ఉల్లి పంట ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కోతకు వస్తుంది. జిల్లాలో దాదాపు 31 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎకరాకు సరాసరి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా. ఈ లెక్కన ఏడాదికి 24.80 లక్షల క్వింటాళ్లు (2.48 లక్షల టన్నులు) ఉల్లి దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖ అధికారులు అంచనా. కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి లైసెన్సుడ్ వ్యాపారుల 15 మందికి మించి వ్యాపారం (ట్రేడింగ్) చేస్తున్నారు. రోజుకు సగటున 8-10 వేల క్వింటాళ్లకు మించి కోనుగోలు చేసే సామర్థ్యం లేదు. దీనికి తోడు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రైతులు ఉల్లి తీసుకొస్తున్నారు. ఆ స్థాయిలో వ్యాపారులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. ఫలితంగా ధరలు పతనమై రైతులు నష్టపోతున్నారు. అదే శీతల గిడ్డంగులు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ఓ వ్యాపారి పేర్కొనడం కొసమెరుపు. కర్నూలు ఉల్లి కోల్‌కతా, తమిళనాడు, కేరళ, గుజరాత్ ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. కోల్‌కతా నుంచి బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసేవారు. ఎగుమతి ఆపేయడంతో ధరలు పడిపోయి రైతులకు నష్టం తప్పడం లేదు. ధరల విపత్తుల నుంచి ఉల్లి రైతులు గట్టేక్కాలంటే అసంపూర్తిగా ఆపేసిన శీతల గిడ్డుంగులు తక్షణమే పూర్తి చేసే వచ్చే ఏడాది నుంచైనా రైతులకు వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసంపూర్తిగా జంబో షెడ్డు

కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ, వాము, కంది, పప్పు శనగ.. వంటి పంట దిగుబడులు క్రయ విక్రయాల కోసం మార్కెట్ ఆఫీసుకు ఎదురుగానే రూ.2.50 కోట్లతో జంబో షెడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. 80 శాతం పూర్తి చేసినా డ్రైన్లు, సిమెంట్ ప్లాస్టింగ్.. వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

1,200 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొన్నాం

● మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి 1200 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డులో జంబో మార్కెట్ గోదాములోని ఉల్లి నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గోదాములో నిల్వ ఉంచిన ఉల్లిని త్వరగా బయటకు సప్లయ్ చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మకానికి వేలం నిర్వహించామన్నారు. ఈవేలంలో హోటళ్లు, విద్యాసంస్థల హాస్టళ్ల తదితర సంస్థల యజమానులు 150 టన్నుల దాకా ఉల్లిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇకపై వేలం పాటలను నిరంతరం నిర్వహించి రైతుల నుంచి సేకరించిన ఉల్లిని అమ్మేందుకు నిర్ణయించామని స్పష్టం చేశారు.



అమ్మకానికి ఉంచిన మార్క్‌ఫెడ్ ఉల్లి

'ఉపాధి' నిధులతో పంచాయతీ భవనాలు

● నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకట్రామయ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లోని పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్రామయ్య తెలిపారు. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) పథకం ద్వారా 80 శాతం నిధులు మంజూరు కానున్నాయి. మరో 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పనులకు సంబంధించి మెటీరియల్ కోటా నిధుల నుంచి సమకూరుస్తారని ఆయన వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు రెండు విడతలుగా దాదాపు 40 బిల్డింగులకు పైగా మంజూరు కానున్నాయి. ఇప్పటి వరకు భవనాలు లేని పంచాయతీల్లో వీటిని నిర్మించనున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.32 లక్షల వ్యయం అంచనా కాగా అందులో రూ.7లక్షలను ఉపాధి పథకం మెటీరియల్ కోటా నుంచి కేటాయించనున్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

9:30



10:00



10:40



కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. రాత్రి 9:56 గంటలకు గ్రహణం ప్రారంభమైంది.. 11 గంటల తర్వాత సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. వాటి దృశ్యాలివీ..

10:50



11:00



11:40



యూరియాతన



గుడికల్లులో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

● సారూ.. ఒక్క బస్తానైనా ఇవ్వండి అంటూ వేడుకోలు

● రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు

● ఆందోళనలో రైతన్నలు

● తాళం వేసి వెళ్లిపోయిన అధికారులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేటట్లు లేదు. అధికారుల (అత్యాశ) తీరుతో రైతన్నలు సాగు చేసిన పంటలకు కనీసం ఎరువులు కూడా దొరకని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం ఎమ్మిగనూరు మండంలోని గుడికల్లు గ్రామంలో వ్యవసాయ అధికారులు వ్యవహరించిన తీరే నిదర్శనమని చెప్పాలి. కొన్నినెలలుగా రైతులు యూరియా కోసం అల్లాడిపోతున్న విషయం అందరికి తిలిసిందే. తాము సాగుచేసిన పంటలకు ఎకరాకు కనీసం ఒక్క యూరియా బస్తానైనా ఇవ్వండి సారూ అంటూ రైతులు వేడుకుం టున్నారు. వ్యవసాయ కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల ముందు పడిగాపులు కాస్తున్నారు రైతులు. యూరియా కోసం ఇంత కష్టపడుతుంటే అధికారులు మాత్రం తమ స్వలాభం కోసమో.. మరేమో గానీ తమకు నచ్చినవాళ్లకు మాత్రమే యూరియాను అందజేస్తున్నారు. దీంతో నిజమైన రైతులకు యూరియా అందక నానాకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కొంత మందికి మాత్రమే ఇచ్చి..

గుడికల్లు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు స్థానిక అధికారిణి హిమబిందు ఆధ్వర్యంలో యూరియాను పంపిణీ చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. కేవలం కొంతమందికి మాత్రమే యూరియాను అందజేశారు. మిగతా రైతులకు మరో రోజు పంపిణీ చేస్తామని చెప్పి రైతు భరోసా కేంద్రానికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. అధికారులు వెళ్లిపోయానప్పటికీ రైతులు మాత్రం తమకు యూరియా అందుతుందన్న ఆశతో అక్కడి కూర్చుండిపోయారు.

అధికారులు చీటీలు రాసిచ్చిన వారికి మాత్రమే..

తూతూ మంత్రంగా యూరియాను అందజేశారని కొంతమంది రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పై అధికారులు చీటీలు రాసిచ్చిన వారికి మాత్రమే యూరియాను అందజేశారని, తమకు యూరియాను అందించకుండా రైతు భరోసా కేంద్రానికి తాళం వేసుకు వెళ్లారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవానికి రైతులందరికి యూరియాను అందజేయాల్సిన అధికారులు మాత్రం ఉన్నతాధికారులు చీటీలు రాసిచ్చిన వారికి మాత్రమే యూరియాను అందజేవెళ్లిపోవడం గమనార్హం.

'యూరియా వచ్చినట్లు కూడా తెలియదు'

ఈ విషయంపై ఏవో శివశంకర్‌ను వివరణ కోరగా ఆదివారం యూరియాను అందజేయాలని చెప్పలేదని, గుడికల్లుకు యూరియా వచ్చినట్లు కూడా తనకు తెలియదన్నారు. వాస్తవానికి సోమవారం రైతులకు యూరి యాను అందించమని అధికారులు చెప్పినట్లు తెలిపారు.

చీటీలు ఇచ్చిన వారికే యూరియాను అందజేస్తున్నారు



ప్రభుత్వం రైతులందరికి యూరియాను అందజేయాలని చెబుతున్నా ఇక్కడి అధికారులు మాత్రం యూరియాను అందజేయడంలేదు. ఉన్నతాధికారులు చీటీలు రాసిచ్చిన వారికి మాత్రమే యూరియాను అందజేస్తున్నారు. అధికారులు సక్రమంగా యూరియాను అందజేస్తే ప్రతి రైతుకు యూరియా అందుతుంది. అయితే అధికారులు మాత్రం నిజమైన రైతులకు యూరియాను అందజేయడం లేదు.

-గోవిందు, రైతు, గుడికల్లు

ఫిజియోథెరపీతో సాంత్వన

ప్రస్తుతం ప్రజల జీవనశైలి మారింది. ప్రతి రోజూ ఉరుకులు, పరుగులు తీయాల్సిన పరిస్థితి. భుజం, మెడ, నడుము, మోకాలి నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో దుష్ఫలితాలు వచ్చే మందుల కంటే ఫిజియోథెరపీ మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఫిజియోథెరపిస్టుల ప్రాధాన్యం పెరిగింది. ఈ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య ఆరోగ్యకరమైన ముడిపడిన వృద్ధాప్యం అన్న నినాదాన్ని ఇచ్చింది. వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో ఫిజియోథెరపీ, శారీరక చురుకుదనం ప్రాధాన్యతను తెలియజేసింది. నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..



- పెరుగుతున్న ఆదరణ
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉపశమనం
- నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ అనేది మందులు లేకుండా, శారీరక వ్యాయామాల ద్వారా రోగాలను నయం చేసే ఒక ముఖ్యమైన వైద్య విధానం. 1996 నుంచి వరల్డ్ ఫిజియోథెరపీ డేను నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఫిజియోథెరపి వైద్య విధానానికి ఆదరణ పెరిగింది. క్లినిక్‌లు పెరిగాయి. కోవిడ్ సమయంలో ఫిజియోథెరపిస్టులకు ఎంతో గుర్తింపు వచ్చింది. మందులతో పని చేయకుండా ఇళ్లవద్ద కూడా ఉండే కొన్ని రకాల వ్యాయమాలు చేయడం ద్వారా చాలా రకాల నొప్పులను నయం చేయడంతో పాటు కొన్నిరకాల వ్యాధుల నుంచి కూడా బాధితులకు విముక్తి లభిస్తుండటంతో ఫిజియోథెరపీపై ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.



అన్ని విభాగాల్లో సేవలు

న్యూరోసర్జరీ, న్యూరాలజీ, పీడీయాట్రిక్, గైనకాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజి, ఆర్థో విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఫిజియోథెరపీ అవసరం ఉంటుంది. కొన్ని రకాల కేసులకు మూడు నెలలు, మరికొన్ని రకాల కేసులకు ఆరు నెలల్లో కోలుకునే అవకాశాలుంటాయి. క్రీడాకారులు ఆటలాడే సమయంలో కండరాల నొప్పులు రాకుండా మెడికల్ ట్యాపింగ్ పద్ధతిని వినియోగిస్తున్నారు. ఒక వేళ ఆటలాడే సమయంలో దెబ్బలు తగిలితే తక్షణమే నొప్పిని, వాపును తగ్గించేందుకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుంది. పెయిన్‌లెస్ డెలివరీలు చేయడం, కాన్పు తర్వాత వచ్చే కాంప్లీకేషన్స్ లేకుండా నివారించడంలో వీరి పాత్ర కీలకంగా మారింది. చిన్న పిల్లల్లో వచ్చే శారీరక ఎదుగుదల లోపాలు, సరి చేయడం క్యాన్సర్ రోగులకు నొప్పి నివారణలోనూ వీరి సేవలను వినియోగిస్తున్నారు.

ప్రతి రోజూ 190 మంది రోగులు..



కర్నూలు జీజీహెచ్‌లోని ఫిజియోథెరపీ విభాగం (ఓపీ నెంబర్.41)లో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నాం. ఆర్థో, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, గైనిక్ వంటి ముఖ్యమైన విభాగాల నుంచి ప్రతిరోజూ 170 నుంచి 190 మంది రోగులు వచ్చి సేవలు పొందుతుంటారు. అన్ని వయస్సులోని ప్రజలు చురుకుగా, ఆరోగ్యంగా ఉండటానికి ఫిజియోథెరపి ఎంతో దోహదపడుతుంది.

● డాక్టర్ పి.లావణ్య, ఫిజియోథెరపిస్టు, జీజీహెచ్, కర్నూలు



నొప్పుల నివారణలో కీలకపాత్ర



కండరాల బలహీనతలతో కూడిన నొప్పులను మందులతో తాత్కాలికంగా తగ్గించొచ్చు. అవి మళ్లీ మళ్లీ వస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫిజియోథెరపీ కీలకపాత్ర పోషిస్తుంది. నొప్పిఉన్న ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి అవసరమైన శారీరక, వ్యాయామాలతో పాటు సహాయక చికిత్సను అందించవచ్చు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడక, వ్యాయామం చేయాలి.

● డాక్టర్ అర్షద్, ఫిజియోథెరపిస్టు, కిమ్స్, కర్నూలు

13న కర్నూలులో జాబ్ మేళా

● కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి భరత్



కరపత్రాలను అవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 21 బహుళ జాతీయ కంపెనీలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్ ఆనంద్ రాజ్‌కుమార్, ప్లేస్ మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ చంద్రన్న(65)కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. ఐదేళ్లుగా బోయ చంద్రన్న ఆయాసం, ఉబ్బసం వ్యాధితో బాధపడు తుండే వాడు. పలు చోట్ల వైద్యం చేయించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. రెండు రోజులుగా ఆయాసం ఎక్కువైంది. దీంతో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో బాత్ రూమ్‌కు వెళ్లి అక్కడ దోమల మందును తాగి స్పృహకోల్పోయాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

మహానంది, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వనం మధు(21) అనే యువకుడు కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం మద్యంలో పురుగుమందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 6గంటల్లోపు ఏపీ చెస్ వెబ్‌సైట్లో తమ ఎంట్రీలు నమోదు చేసుకోవాలని జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నంద్యాల పట్టణంలో ఈ నెల 13, 14తేదీల్లో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల చెస్ సంఘం, ఎస్ఆర్‌జీ చెస్ అకాడమి నిర్వహణలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలు రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహి స్తామన్నారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు భోజన, వసతితోపాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్: 9010451585ను సంప్రదించాలని సూచించారు.

ఇరు వర్గాల ఘర్షణ

ఏడుగురికి తీవ్ర గాయాలు.. 30 మంది పై కేసు నమోదు

గోనెగండ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐరన్‌బండ గ్రామంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ విషయంలో మునెప్ప నాగేష్‌ను శనివారం ఉదయం మందిలించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న నాగేష్ తన కుటుంబసభ్యులు, వర్గీలయుతో కలిసి రాత్రి మునెప్ప కుటుంబ సభ్యులు, వర్గీయులపై కంట్లో కారం చల్లి కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో మునెప్పతో పాటు హనుమంతు, చిన్న పెద్దయ్య, పెద్దపెద్దయ్య, నాగరాజు, రాముడు, రామయ్యలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. మరో ముగ్గురి మహిళలకు ముకి దెబ్బలు తగిలాయి. గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేష్ వర్గీయులపై మునెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బోయ నాగేష్ తండ్రి బోయ పాండురంగడు తన కూమారుడైన బోయ నాగేష్ పై అన్యాయంగా దాడికి మునెప్ప వర్గీయలు పాల్పడినారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు పై విచారణ జరిపి మునెప్పు ర్గానికి చెందిన 14 మందిపై.. పాండురంగడు వర్గానికి చెందిన వారిపై 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

కేసీఆర్ బలమైన నాయకుడు

● తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ● శ్రీశైలంలో ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్

శ్రీశైలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఒక బలమైన నాయకుడని తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. ఆదివారం శ్రీశైలం చేరుకున్న ఆయన స్వామిఅమ్మవార్ల దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రవణ్ మాట్లాడుతూ కేసీఆర్ దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి అమ్మవారికి పూజలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షోభాలు, సమస్యలు ఎన్ని వచ్చినా వాటిని కేసీఆర్ అధిగమించి మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తంచేశారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లు పొడిచినా కేసీఆర్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటారన్నారు. తెలంగాణ రైతాంగం చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, యూరియా సమస్యను ప్రభుత్వం ముందస్తుగా అంచనా వేసిఉంటే సమస్య వచ్చేది కాదన్నారు. యాదాద్రి దేవాలయం అభివృద్ధి మాదిరే శ్రీశైలం అభివృద్ధికి కూడా సహకారం అందిస్తారన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం అభినందనీయం



డీఈవో శామ్యూల్ పాల్, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతో సత్కార గ్రహీతలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులైన ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, సాహిత్యం, కళలు, నాటక రంగంలో రాణిస్తున్న 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో విచ్చేశారు. గత సంవత్సరం పది ఫలితాలను 62 శాతం నుంచి 89 శాతానికి పెంచిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు సాహిత్యంలో, కళా, నాటక రంగాల్లో రాష్ట్రస్థాయిలో పేరొందిన వారిగా గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు. అంతకు ముందు ఇటీవల మరణించిన రెండు నంది పురస్కారాల గ్రహీత, కళాక్షేత్రం శాశ్వత సభ్యుడు వన్నెం బలరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విశ్రాంత ఎంఈవో పి. రాజారత్నం, విశ్రాంత హెచ్‌ఎం, గజల్ గాయకుడు మహమ్మద్ మియా, కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, సభ్యులు కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అవోపా విద్యానిధి' సేవలు మరువలేనివి: టీజీ



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్లుగా అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) సంస్థ నిర్వహిస్తున్న సేవలు మరువలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రశంసించారు. అవోపా విద్యానిధి ద్వారా ఎదిగిన విద్యార్థులు భవిష్యత్తులో తగిన చేయూత అందించి మరింత అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. ఆదివారం నగరంలోని సుంకేసుల రోడ్డులోగల అవోపా సేవాసదన్‌లో అవోపా విద్యానిధి రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ విచ్చేశారు. ఆయనకు అవోపా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టీజీ వెంకటేశ్ అవోపా విద్యానిధి రజతోత్సవ లోగోను ఆవిష్కరించారు. తర్వాత ఆయన ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన ఆర్యవైశ్య ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేస్తూ చక్కటి వేషధారణలతో ప్రదర్శన నిర్వహించిన ఆర్యవైశ్య మహిళలను ఆయన అభినందించారు. టీజీ మాట్లాడుతూ అవోపా విద్యానిధి ద్వారా సహాయం పొందిన వారు జీవితంలో స్థిరపడ్డాక మరింత మంది చదువుకునేలా తమ సహకారం అందించాలని సూచించారు. హైదరాబాదులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో చదివిన షైహోమ్స్ అధినేత ముందుకు వచ్చారని గుర్తు చేశారు.

● నగరంలోని అవోపా సేవాసదన్‌లో జరిగిన అవోపా విద్యానిధి రజత్సోత వేడుకల్లో పరిశ్రమశాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రజతోత్సవ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థిక సహాయంతోపాటూ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన ఆర్యవైశ్యులను మంత్రి అభినందించారు.

నంద్యాలకు చేరుకున్న 'ఇస్కాన్' పాదయాత్ర

● ఘన స్వాగతం పలికిన భక్తులు

● అబ్బురపరుస్తున్న ఎద్దుల జతలు



స్వామివారి రథం

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన భారతదేశ పాదయాత్ర ఆదివారం నంద్యాలకు చేరుకుంది. ఇస్కాన్ ఆల్ ఇండియా అధ్యక్షులు స్వామిజీ శ్రీమాన్ ఆచార్య ఆధ్వర్యంలో 25 మంది సభ్యుల బృందం నంద్యాలకు మొదటి సారి వచ్చింది. గతంలో ఆరు పర్యాయాల పాటు దేశ పాదయాత్ర చేపట్టినా నంద్యాలకు చేరుకోవడం ఇదే మొదటిసారి. 7వ పర్యాయం కేదర్‌నాథ్ నుంచి ప్రారంభించిన యాత్ర ప్రతిరోజు 10 కిలోమీటర్ల ప్రయాణం చేస్తూ బద్రినాథ్, ద్వారకా, పూరి, శ్రీ కూర్మం, మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా ఇక్కడికి చేరుకున్నారు. అయ్యలూరు మెట్ట వద్దకు చేరుకోగానే నంద్యాల ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా స్వాగ తం పలికారు. పట్టణంలో ప్రజలకు మహా హరినామ సంకీర్తన నిర్వహించారు. ద్వారకానగరం నుంచి తెచ్చిన ఎద్దుల బండ్లపై యాత్ర కొనసాగుతోంది. బృందావనం, మాయాపురం పేర్లు కలిగిన ఎద్దులు ప్రజలను అబ్బురపరుస్తున్నాయి.

సనాతన ధర్మాన్ని వివరిస్తూ..



సనాతన ధర్మాన్ని పట్టణ, గ్రామీణ ప్రజలకు వివరిస్తూ భాగవత, రామాయణాల పుస్తకాలను పంపిణీ చేస్తూ యాత్ర కొనసాగుతోంది. నంద్యాల నుంచి అహోబిలం చేరుకుని, అక్కడి నుంచి తిరుపతి, రామేశ్వరం మీదుగా కన్యాకుమారికి చేరుకుంటుందన్నారు.

● అమలనిమయ్‌దాస్, శ్రీశైలం, మార్కాపురం జనరల్ మేనేజర్, ఇస్కాన్

ఒకే రోజు మూడిళ్లలో చోరీ

● బంగారు, వెండి, నగదు అపహరణ

మంత్రాలయం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకేరోజు మూడిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. వివ రాలు.. సుంకేశ్వరి గ్రామంలో చాకలి సత్తెన్న చెందిన రెండు ఇళ్లల్లో వేరువేరు బీరువాలను పగులకొట్టి నాలుగు తులాల బంగారు, రూ.20వేల నగదు, మరో బీరువాలో రూ.2లక్షల నగదు చోరీకి గురైంది. చాకలి గోవిందు ఇంట్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వీరు ఇంటికి తాళాలు వేసుకుని బెంగుళూరులో వలస వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నారు. ఇంటి వద్దనే వృద్ధ తల్లిదండ్రులు ఉండేవారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సత్తెన్నకు చెందిన రెండు బీరువాలు, చాకలి గోవిందుకు చెందిన మరో బీరువా, తలుపులను పగులకొట్టి ఇంట్లో ఉన్నదంతా దోచుకెళ్లారు. కొన్ని పత్రాలను, ట్రంకు పెట్టెను ఊరుబయట పొలాల్లో పడేసి వెళ్లారు. తెల్లారిసరి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చాకలి సత్తెన్న, సర్పంచ్ ముకురన్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరు పరిశీలిం చారు. కర్నూలుకు చెందిన క్లూస్ టీం అధికారులు వేలిముద్రలు సేకరించారు. ఖగ్గల్లు గ్రామంలో బోయ వీరేష్ అనే వ్యక్తి రోజూ రాయచూరు వెళ్లి కూలి పనులు చేస్తూ జీవనం చేసేవారు. అదేరోజు రాత్రి అతడికి చెందిన మరో ఇంట్లో నిద్రించాడు. కాస్త దూరంలో ఉన్న ఇంట్లో 2 తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు వాపోతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఒకే రోజు రెండు గ్రామాల్లో మూడు చోరీలు జరగడం మాధవరం పోలీసులకు సవాల్‌గ మారింది. ఆరు నెలలుగా ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రచ్చుమర్రి, తుంగభద్ర, మాధవరం ప్రాంతాల్లో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు సీసీ ఫుటేజీలు, వాహనాల నెంబర్ల ఆధారంగా నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

శ్రీశైలంలో చిరుత కలకలం

శ్రీశైలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో పాతాళగంగ మెట్ల పంప్‌హౌస్ సమీపంలో శనివారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. సమీపంలో నివాసముం టున్న ఫక్కీరయ్య అనే వ్యక్తి ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరించడం గమనించారు. కేకలు వేయడంతో చిరుత పరుగులు తీసింది. సమాచారం తెలుసుకున్న సున్నిపెంట అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మదన్ ఘటనాస్థలికి చేరుకున్నరు. వివరాలు అడిగి తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి వేళలో చిరుత సంచరిస్తుండటాన్ని గుర్తించి అటవీశాఖ సిబ్బందితో గస్తీ ఏర్పాటుచేశారు.

మార్కెట్‌కు తీసుకొచ్చిన ఉల్లి మొత్తం కొనుగోలు చేస్తాం

● కనీస మద్దతు ధర రూ.1,200 అందిస్తాం

● అంతకంటే తక్కువకు ధర పలికితే వ్యత్యాసం డబ్బు ఖాతాలో జమ చేస్తాం

● కలెక్టరు రంజిత్‌బాషా



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ, కలెక్టరు

కర్నూలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చే ప్రతి కిలో ఉల్లి గడ్డలు కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా భరోసా ఇచ్చారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.1,200లు ప్రకటించిందని తెలిపారు. వ్యాపారులు ఎంత రేట్కుకైతే కొలుగోలు చేస్తారో, మిగిలిన మొత్తం బోనస్ రూపంలో రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఉదాహరణకు వ్యాపారి క్వింటా రూ.250లకు కొనుగోలు చేస్తే, మిగిలిన వ్యత్యాసం అమౌంట్ రూ.950 ప్రకారం లెక్కకట్టి రైతులకు ఖాతాలో జమ చేస్తామని అన్నారు. జిల్లాలో 31 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారని తెలిపారు. ఇప్పటికే ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 1,226 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. శనివారం ఒక్క రోజే 1600 టన్నులు మార్కెట్‌కు వచ్చిందని గుర్తు చేశారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన ప్రతి గడ్డను కొనుగోలు చేస్తామని, అధైర్యపడాల్సిన అవసరం లేదని వివరించారు. ఉల్లి రైతులకు తప్పుడు సంకేతాలు ఇస్తూ సోషల్ మీడియాలో కొందరు చేసే ఫేక్ ప్రచారాలు, వదంతులు నమ్మవద్దని వివరించారు. మార్కెట్‌కు ఉల్లి తీసుకొచ్చే సమయంలో ఆరబెట్టి, గ్రేడింగ్ చేసి తీసుకొస్తే మంచి ధర వస్తుందని తెలిపారు. అలాగే.. జిల్లాలో యూరియా సమస్య లేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,200 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. మరో రెండు రోజుల్లో 2,600 టన్నులు యూరియా వస్తుందన్నారు. నానో యూరియాను కూడా వినియోగించుకోవాలని కలెక్టరు రైతులకు సూచించారు. గత ఏడాది 56 వేల టన్నులు వివిధ రకాల రసాయన ఎరువులు సరఫరా చేస్తే, ఈ ఏడాది 64,746 టన్నులు సరఫరా చేశామన్నారు. రబీ కోటా మళ్లీ వస్తుందని, ఇప్పుడే కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. యూరియా అక్రమ రవాణా చేసిన ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. రూ.1.50 కోట్లు విలువైన యూరియా సీజ్ చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు సత్వర పరిష్కారానికే పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తొలి రోజు 79 గ్రామాలకు ప్రత్యేక అధికారులు వెళ్లి పలు సమస్యలు గుర్తించారు. ఆర్థిక పరమైన, డబ్బు లేకుండా పరిష్కరించే సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఒక్క రోజులో 25 సమస్యలు పరిష్కరంచినట్లు కలెక్టరు రంజిత్‌బాషా తెలిపారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ యూరియా అక్రమ రవాణా అరికట్టేందుకు విజిలెన్స్ పోలీసులు సరిహద్దుల్లో పక్కా నిఘా పెట్టామని తెలిపారు. ఉల్లి విక్రయాలపై తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని సూచించారు.

మార్కెట్‌ను సందర్శించిన కలెక్టరు, ఎస్పీ :

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డును కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టరు బి.నవ్య పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తీసుకొచ్చిన ఉల్లి దిగుబడులు పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలను తనిఖీ చేశారు. సీఎం చంద్రబాబు ఉల్లికి కనీస మద్దతు ధర రూ.1,200లు ప్రకటించారని, వ్యాపారులు అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే, ఆ వ్యత్యాసం అమౌంట్‌ను రైతుల ఖాతాలో జమ చేస్తామని, మార్కెట్ అధికారులు టోకన్లు ఇస్తారని కలెక్టరు రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మీ, మార్కెట్‌యార్డు సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి



మాట్లాడుతున్న ఇరిగినేని పుల్లారెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. ఆదివారం సంఘం ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి అశోక్‌నగర్, వెంకటరమణకాలనీ, ప్రేమ్‌నగర్, మమతానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ మమతానగర్ కూడలిలో 60 అడుగుల రోడ్డు మధ్యలో కల్వర్టు పై పడిన గుంత చుట్టూ బండరాళ్లు పెట్టి ఎర్ర మట్టితో ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారన్నారు. ప్రైవేట్ టెలికాం కేబుల్ కోసం రోడ్లను తవ్వి అలాగే వదిలి వేస్తున్నారని అన్నారు. జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లకు గుంతలు పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.గఫూర్, మోహన్, ఏ.ఆంజనేయులు గౌడు, ఎండి.యూనుస్, ఏ.వెంకటేశ్వర్లు, కే.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు న్యాయం చేయాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి రైతులకు న్యాయం చేయాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆదివారం డిమాండ్ చేశారు. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వమే క్వింటాల్‌కు రూ.1800 చొప్పున కొనుగోలు చేయాలని అన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలు 27,28 తేదీలలో నిర్వహిస్తున్నామని, ఈ సభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కేకే భవన్‌లో సీఐటీయూ కర్నూలు మండల మూడో మహాసభలు అధ్యక్షుడు ఉసేనయ్య అధ్యక్షతన నిర్వహించారు. అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులు బీసన్న, హుసేనయ్య, ఉపాధ్యక్షుడు మస్తాన్, చెన్నయ్య, ఏసన్న, సహాయ కార్యదర్శులు నాగేశ్వరి, తిమ్మప్ప, రమీజాబి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ సబ్ జూనియర్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సబ్ జూనియర్‌లో పాల్గొనే క్రీడాకారులు 14 ఏళ్లలోపు (01.01.2011) మధ్య జన్మించిన వారై ఉండాలని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఒంగోలులో 27, 28 తేదీల్లో జరిగే సీనియర్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు అనంతపురం జిల్లా ఉరవకొండలో 13, 14 తేదీల్లో జరిగే పోటీల్లో జిల్లా నుంచి సబ్ జూనియర్ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు తమ కాలనీలో ఏవైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విధుల్లో పండుగ రోజుల్లోనూ, సెలవు రోజుల్లోనూ పాల్గొన్న ప్రధానోపాధ్యాయులకు, సీసీఎల్ మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ కృష్ణారెడ్డి, ధనుంజయ, వర్కింగ్ ప్రెసిడెంటు రవిప్రకాష్ ఆదివారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిబంధనలను అనుసరించి సమర్ధవంతంగా విధులు నిర్వహించారని అన్నారు.

వామ్మో... జ్వరాలు



ఆసుపత్రి వద్ద రోగులు



- ఆసుపత్రులకు పెరిగిన రోగుల సంఖ్య
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- సీసీ రోడ్లు నిర్మించారు..డ్రైనేజీలు మరిచారు..
- వర్షపునీటితో చెరువులను తలపిస్తున్న రహదారులు
- గ్రామాల్లో కనిపించని వైద్య శిబిరాలు

కేతవరంలో రోడ్డుపైనే వర్షపు నీరు

గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఒకరు ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. గతంలో ఓర్వకల్లు ఆసుపత్రికి రోజూ ఓపీకి 20 వచ్చేవారు. నేడు 200 మంది దాకా వస్తున్నారు. అయితే ఎన్ని మందులు వాడినా జ్వరాలు తగ్గడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వర్షపు నీరు, మురుగు నీరంతా రోడ్లపైన, ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. వీటి వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- ఓర్వకల్లు

మండలంలోని ఓర్వకల్లు, ఎన్. పొందలపాడు, తిప్పాయిపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల, బైరాపురం, కేతవరం, తదితర గ్రామాల్లో డ్రైనేజీలు లేవు. వర్షపు నీరు రోడ్లపైనే, ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న వాటిని శుభ్రం చేయకపోయడంతో చెత్త చెదారంతో నిండిపోయింది. డ్రైనేజీలు నిర్మించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు.

వైద్యం అందడం లేదు



సీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమయ పాలన పాటించక పోవడంతో రోగుల అవస్థలు పడుతున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

మధు, బాధితుడు గుట్టపాడు

రాత్రి వేళల్లో వైద్యం అందడం లేదు



సీజనల్ వ్యాధులకు విజృంభిస్తున్నా వైద్యులు సరైన చికిత్సలు చేయడం లేదు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కర్నూలుకు వెళ్తున్నారు.

● సుధాకర్, సీపీఐ నాయకుడు, ఓర్వకల్లు

వైద్యం కరువు



ఓర్వకల్లులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఆసుపత్రికి చుట్టుపక్క గ్రామాల ప్రజలు వస్తుంటారు. గ్రామాల్లో జ్వరాలు అధికం కావడంతో రోజు 200 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. రక్తపరీక్షలు చేయించుకునేందుకు ప్రైవేటు ల్యాబ్‌ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు.

దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్, కేవీ సుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి, దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకంగా నిలుస్తుందని విద్యావేత్త, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ సమావేశ హాలులో విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న 25 మంది గురువులను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నాగేశ్వరరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఐ విజయ్‌కుమార్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్సీ డీఎస్పీ మహబూబ్ బాషా, తాటిపాడు మహబూబ్ సాహెబ్, విశ్రాంత ఎమ్మార్వో మురారి శంకరప్ప, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ బాలేశ్వరయ్య, డాక్టర్ రంగనాయక్, బాలసుబ్రహ్మణ్యం, రాయపాటి నాగలక్ష్మి, టి. వెంకటరెడ్డి ప్రసంగించారు. ఎంపిక చేసిన 25 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

వైసీపీ విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలి



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత ఉందని వైసీపీ విష ప్రచారం చేస్తుందని, దీన్ని రైతులు తిప్పికొట్టాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో రైతులకు యూరియా పంపిణీ చేశారు. గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు సుధాకర్‌రావు మాట్లాడుతూ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఓ ఫేక్ ఫొటోను పోస్టు చేసి యూరియా కొరత ఉందని, యూరియా ఇవ్వలేకపోతున్నారని ప్రచారం చేస్తున్నారని, యూరియా కొరత ఎక్కడైనా ఉందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామిరెడ్డి, ఎస్.కొంతలపాడు శ్రీనివాసులు, అల్లాబాబు, అబ్దుల్లా, కురువ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పంచాయతీలు



సురేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు జె. సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కె నాగలాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింది మంజూరైన రూ.35లక్షల నిధులతో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ జె నయోమి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోపాల్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ అల్లిపీరా, నీటి సంఘం అధ్యక్షుడు ధర్మా రెడ్డి, ఉపసర్పంచ్ మీనా, నాగ సుంకన్న, తిరుపాలు పాల్గొన్నారు.

విన్నకోట నాగేశ్వరరావుకు ఘన నివాళి



బలిజ రత్న విన్నకోట నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బలిజ సంఘం వ్యవస్థాపక సభ్యుడు, రోపా సలహాదారు దివంగత బలిజ రత్న విన్నకోట నాగేశ్వరరావుకు రోపా (రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోగల రోపా కార్యాలయంలో విన్నకోట నాగేశ్వరరావు చిత్ర పటానికి పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంస్మరణ సభలో విన్నకోటి నాగేశ్వరరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రోపా కన్వీనర్ కోనేటి చంద్రబాబు, అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, బలిజ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కప్పట్రాళ్ల మోహన్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రామనాథ్, జనసేన పార్టీ జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్, సీనియర్ సంఘ నాయకులు ఎక్కంటి శ్రీనివాసులు, తుళువ గోపాల్, మలిశెట్టి దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతం


కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం (హరిహర క్షేత్రం)లో పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహికంగా భక్తులతో ఈ వ్రతాలు ఆచరించి, మధ్యాహ్నం ఒంటి నుంచి ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయాల మూసివేత

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా నగరంలోనివివిధ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. ఆదివారం రాత్రి రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సుమారు 9.57 గంటలకు (గ్రహణ స్పర్శ) ప్రారంభమై రాత్రి 1.26 గంటల వరకు ఉంటుందని పంచాంగ కర్తలు చెబుతున్నారు. రాత్రి 11 గంటలకు సంపూర్ణ గ్రహణం ప్రారంభమై, రాత్రి 11.41 గంటలకు గ్రహణ మధ్య కాలం, రాత్రి 12.22 విడుపు ప్రారంభమతుందని, రాత్రి 1.26 గంటలకు గ్రహణ ముగిస్తుంది. సంపూర్ణ బింబ దర్శనం 1.22లకు ఉంటుంది. కాగా చంద్రగ్రహణం కారణంగా నగరంలోని అన్ని ప్రధాన దేవాలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం ఆయా ఆలయాలను సంప్రోక్షణ(శుద్ధి)లతో పూజాది కార్యక్రమాలను పునఃప్రారంభించనున్నారు.



మూసివేసిన సూర్యనారాయణ ఆలయం



కాల్వబుగ్గలో..



విజ్ఞాన మందిర్ వద్ద..

ఓర్వకల్లు: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ తెలిపారు. ఆదివారం చంద్రగ్రహణం కారణంగా ఆలయ ముఖద్వారాలు మూసివేయడం జరిగిందన్నారు. అలాగే సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి ఆలయ శుద్ధి సంప్రోక్షణ జరిపిన తర్వాత స్వామి, అమ్మవార్ల ప్రాతకాల పూజలు చేస్తామన్నారు. అనంతరం గణపతి హారతి తదితర పూజలు చేసి ఆలయంలోకి భక్తుల ప్రవేశం జరుగుతుందన్నారు.

కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌ను కలిసిన సొసైటీ అధ్యక్షులు



విష్ణువర్ధన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీ చైర్మన్లు, నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం హుశేనాపురం సొసైటీ అధ్యక్షులు సీఎస్ సుధాకర్ రెడ్డి, ఓర్వకల్లు సొసైటీ అధ్యక్షులు సి.సుధాకర్‌రావు, నన్నూరు సొసైటీ అధ్యక్షులు డి.నాగేశ్వరరెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 12న ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి భవనంలో జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌ను ఆహ్వానించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఓర్వకల్లు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఓర్వకల్లు సహకార పరపతి సంఘం చైర్మన్ సి.సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా పంట రుణాలు, పైపులు, ఎరువులు, విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. సొసైటీని అభివృద్ధి బాటలో పయనించేందుకు రైతులు సహకరించాలన్నారు. అనంతరం సొసైటీని కలరింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సీఈవో మద్దిలేటిని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చెన్నూరు భాస్కర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు కొంతలపాడు శ్రీనివాసులు, సీఈవో మద్దిలేటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ సమస్యలు ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జాతలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కర్నూలు నుంచి ప్రారంభమై కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ సెంటర్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యేహోవా, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, ఇబ్రహీం, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

'రైతులను విస్మరించిన ప్రభుత్వం'



మాట్లాడుతున్న అవుల శేఖర్

సి. బెళగల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులను కూటమి ప్రభుత్వం విస్మరించిందని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని పోలకల్లు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా దొరకక నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు సరిపడ యూరియాను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు కూడా మద్దతు ధర కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రైతు సమస్యలపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయకార్మిక గూడురు సీపీఐ నాయకుడు శ్రీనివాసులు, సంఘంనాయకులు శేషు, రాజు, రహీం, యువరాజు, దేవదాసు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని డీఆర్వో వెంకట నారాయణమ్మ అన్నారు. ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ మహిళలు చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏవో శివరాముడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కృష్ణ, మహిళా విభాగం చైర్మన్ సహారా బాను, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాకు మూడో స్థానం

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ద్వారక తిరుమలలో రెండు రోజుల కిందట జరిగిన 50వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు 25 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిందని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మికాంతరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగా క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు అవినాష్ శెట్టి, కార్యదర్శి మునిస్వామి, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, శశిధర్, సాయి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరమని జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు బిజినేపల్లి సందీప్ అన్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో టీజీవీ, టీజీబీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో యూనివర్సల్ కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు జరిగింది. 25 మంది చిన్నారులు కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం బెల్టు టెస్టులో పాసైన చిన్నారులకు వివిధ రకాల బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు, ఎగ్జామినర్ పి.శ్రీనివాస వర్మ, క్రాంతి, హేమలత పాల్గొన్నారు.

రచనలతో ప్రజా చైతన్యం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్య స్ఫూర్తిని అందించే రచనలు నేటి తరానికి అవసరమని తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ అన్నారు. ఆదివారం నగరంలోని వెంకటరమణ కాలనీ, రోడ్ నెం.3లోగల సాయి రాఘవ రెసిడెన్సీలోని సమావేశ హాలులో కర్నూలుకు చెందిన రచయిత కేపీఆర్ శర్మ రాసిన 'కవితా(వి)హారం' కవితా సంకలనం పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ విలువలతో కూడిన సాహిత్యాన్ని అందిస్తూ ముందుకు పోతున్న శర్మ అభినందనీయులని, పద్య రచనలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ప్రముఖ బాలల సాహిత్యవేత్త డాక్టర్ ఎం. హరికిషన్, పుస్తక సమీక్షురాలు రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళి, సాహితీవేత్తలు డాక్టర్ రాధాశ్రీ, విశ్రాంత ఆర్‌ఐఓ కె. రంగనాథశర్మ, విశ్రాంత ఆంధ్రప్రగతి బ్యాంకు చీఫ్ మేనేజర్ కె. కల్యాణశాస్త్రి, నాట్య గురువులు భార్గవ్, ఎస్ కరీముల్లా తదితరులు ప్రసంగించారు.

నిజమైన సూపర్ హీరోలు నేత్రదాతలే



ర్యాలీ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి ఇద్దరికి పునర్జన్మ ఇచ్చిన నేత్రదాతలే నిజమైన సూపర్ హీరోలు అని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, కేఈ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డా.కేవీ సుబ్బారెడ్డి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం కలెక్టరేట్ నుంచి సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు కొనసాగింది. ర్యాలీలో సుశీల నేత్రాలయ అధినేత డా.పి.సుధాకర్‌రావు, సుశీల నేత్రాలయ రెటీనా సర్జన్ డా.నేహ సుధాకర్, కార్నియా స్పెషలిస్టు డా.పి.రాఘవ ప్రీతమ్, గ్లకోమా స్పెషలిస్టు డా.ఏ.విజయలక్ష్మి, డా.చరిష్మా, డా.శ్రీతేజా సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఎక్కడ?



మండలంలోని బొల్లవానిపల్లె గ్రామం వద్ద ప్రధాన రహదారిలో మోకాళ్లలోతు నీరు నిలిచింది. ఈ దారిలోనే పగిడిరాయి, ఉప్పర్లపల్లె, సూర్యతండా, ప్యాపిలి తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మట్టిరోడ్డు కావడం, గుంత ఉండటంతో వర్షపునీరు, మురుగు నిలిచి వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.
\- తుగ్గలి

ముప్పు



మండల కేంద్రంలోని సహకార బ్యాంకు పక్కన కల్వర్టు సరిగా వేయకపోవడంతో గుంత పడింది. ఏమాత్రం అజ్ఞాత్తగా ఉన్నా గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. దేవనకొండ - పత్తికొండ ప్రధాన రహదారి, బీసీ కాలనీ, బ్యాంకుకు దీని మీదుగానే వెళ్లాలి. వాహనదారులు గమనించకపోతే ప్రమాదం తప్పదు. కాలువ గుంతను మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.
\- దేవనకొండ

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



ఎస్ఐ మల్లికార్జున

తుగ్గలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున అన్నారు. ఆదివారం మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామ న్నారు. గ్రామాల్లో అల్లర్లు చోటుచేసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్న చిన్న సమస్యలతో ఘర్షణలకు పాల్పడవద్దని, సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

మద్దికెర సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు నాగరాజు, సహాయ కార్యదర్శులు మదనంతపురం హనుమన్న, పెరవలి సుధాకర్ కోరారు. ఆదివారం మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సకాలంలో టమోటా అధికంగా సాగు చేశారని, దిగుబడి వచ్చే సమయంలో ధర పడిపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉల్లికి మార్కెట్ సదుపాయం లేక ధరలు పడిపోవడంతో రైతులకు అంతుచిక్కడం లేదన్నారు. ప్రభుత్వం ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో భరోసా



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

మద్దికెర సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధితులకు భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. ఆదివారం ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బాధితులు పార్వతమ్మకు రూ.లక్ష, గోవిందప్పకు రూ.74వేల చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెద్ద వీరన్న రమేష్, ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాంబాబు బాధితులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా చూస్తున్నారని తెలిపారు.

సామాజిక సేవకుడికి అభినందన

ఆదోని టౌన్ , సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తాను మంత్రి టీజీ భరత్ అభినందించారు. ఈమేరకు ఆదివారం కర్నూలులో నిర్వహించిన ఆవోపా విద్యానిధి రజోత్సవ సంబరాల్లో అవార్డులు బహూకరించారు. మూడు సంవత్సరాల్లో మూడు వేల మది ఉచిత కంటి ఆపరేషన్‌లు చేయించుకోవడానికి సహకరించినందుకు ఈ అవార్డు ఇచ్చినట్లు గుప్తా తెలిపారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పువ్వాడ చంద్రశేఖర్, రత్న ప్రసాద్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మల్లి, పెద్ద నాగేశ్వర రావు పాల్గొన్నారు.



మంత్రి భరత్ నుంచి అవార్డు అందుకుంటున్న గుప్తా

నైతిక విలువల విద్యను అందించాలి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ సూచించారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయులు వినూత, కళ్యాణి కుమారి, మారుతి, చంద్రమోహన్‌ను సన్మానించారు. సత్యనారాయణ, వీరచంద్రయాదవ్, నారాయణ, బలరాముడు ఉన్నారు.

15లోపు ఈ-క్రాప్ పూర్తి చేయాలి

మద్దికెర సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలను ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఏవో రవి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులు పాస్‌బుక్, 1బీ, ఆధార్ ఇచ్చి సహకరించాలని, నమోదు చేయకుంటే ప్రభుత్వ పథకాలు అందవదన్నారు. వీఏఏలు ఆనంద్, రేష్మా ఉన్నారు.



పంట నమోదు చేస్తున్న సిబ్బంది

స్మార్ట్ మీటర్లు హోటళ్లకు భారం



మాట్లాడుతున్న హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి వీరేష్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లు హోటళ్లకు భారంగా మారాయని హోటల్స్ అసోసియేషన్ పట్టణ కార్యదర్శి టి వీరేష్ అన్నారు. ఆదివారం ద్వారక హోలులో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనతో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. గతంలో నెలకు రూ. వెయ్యిలోపు వచ్చే విద్యుత్ బిల్లులు , స్మార్ట్ మీటర్ల ప్రభావంతో రెట్టింపయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు రుణాలు కోసం ఇన్‌కమ్ టాక్స్ చేయించడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతున్నారన్నారు. దీన్ని రద్దు చేస్తామని పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఈనెల విజయవాడలో జరిగే రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ సమావేశానికి భారీగా రావాలనిపించారు. విట్టా రమేష్, మాధవ స్వామి బసవన్న గౌడ్, ప్రవీణ్, శ్రీనివాసరావు, సోమశేఖర్ వీరేష్ పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుతోనే ఆదోని అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి అన్నారు. ఆదివారం పబ్లిక్ రీడింగ్ రూమ్(మర్చంట్ క్లబ్) వందేళ్ల వేడుక అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, డాక్టర్ మధుసూదన్, డీఎస్పీ హేమలత, కురు కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, మున్సిపల్ ఛైర్ పర్సన్ లోకేశ్వరి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే ఆదోనిలో చారిత్రాత్మక కట్టడాలు, పురాతన మసీద్, రణమండల కొండ ఉందని గుర్తు చేశారు. రెండో ముంబాయిగా పేరుగాంచినా, ఆదోని అభివృద్ధికి నోచుకోక పరిశ్రమలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాల పునఃవ్యవస్థీకరణ జరుగుతుందని ఆదోని ప్రాంత ప్రజల సెంటిమెంట్ జిల్లా ఏర్పాటు కావాలని బలంగా ఉందన్నారు. మేధావులు, వ్యాపారులు, ప్రజలు పార్టీలకతీతంగా జిల్లా ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడి, సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ రీడింగ్ రూంలో షటిల్ కోర్టు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టెన్నిస్ విజేతలకు బహుమతులను అందజేశారు. విశ్వనాథ్ రెడ్డి, రాయచోటి సుధాకర్, దేవిశెట్టి ప్రకాష్ శ్రీధర్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, నటరాజ్, డాక్టర్ రఘుజీ ఉన్నారు.

జగన్ మాటలను ప్రజలు నమ్మరు

మద్దికెర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మరని టీడీపీ నాయకులు గూడూరు ధనుంజయుడు, జానకి చౌదరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మిదేవి, మంగళ సోమశేఖర్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందన్నారు. వైసీపీ హయాంలో పేద ప్రజలు ఇబ్బందులకు గురయ్యారనీ అన్నారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, ఎమ్మెల్యే శ్యాంబాబు సహకరిస్తున్నారన్నారు. ఉన్నారు.

రజకుల అభివృద్ధికి మంత్రుల సహకారం



విశాఖ రజకుల ఆకాంక్ష సభలో మాట్లాడుతున్న సావిత్రి

ఆదోని టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి సహకరిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు రజక కార్పొరేషన్ ఛైర్పర్సన్ సావిత్రి తెలిపారు. విశాఖలో ఆదివారం రజకుల ఆకాంక్ష సభలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, గృహ నిర్మాణ మంత్రి పార్థసారథి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు మాధవ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు.

కుట్టు మిషన్లతో మహిళలకు చేయూత



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

దేవనకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుట్టు మిషన్లతో మహిళలకు చేయూత లభిస్తుందని వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని బంటుపల్లి గ్రామంలో 70 మంది మహిళలకు రాయితీ కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మహిళలు కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. మల్లికార్జునగౌడ్, రాజశేఖర్‌గౌడ్, ఉచ్చీరప్ప, రామాంజిని, ఉమేష్, సూరి, వీరయ్య, ప్రతాప్, రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు ప్రదానం

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు ఖాజాబేగ్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్స్‌లెన్సీ అవార్డును అందజేశారు. ఆదివారం కర్నూలులోని సెంట్రల్ లైబ్రరీలో తనకు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ వారు ప్రధానం చేసినట్లు ఖాగాబేగ్ తెలిపారు. క్లబ్ సభ్యులు రాయపాటి శ్రీనివాస్, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్వీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఖాజాబేగ్

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా మహేంద్రరెడ్డి



ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా మొలగవల్లి మహేంద్రరెడ్డిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయం లేఖను విడుదల చేసింది. మహేంద్రదరెడ్డి మాట్లాడుతూ వైసీపీ స్థాపించిన సమయం నుంచి తాను మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. 2029లో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని, పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు వస్తుందన్నారు.

దళితులపై దాడులు ఆగడం లేదు

ఆదోని రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళితులపై దాడులు ఆగడం లేదని నిత్యం ఏదో ఒక ప్రదేశంలో జరుగుతూనే ఉన్నాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాట్లాడుతూ, ఆదోని డివిజన్‌లో దళితుల పట్ల కులవివక్ష, అంటరాని తనం, దాడులు పెరిగాయన్నారు. దాడుదల వ్యతిరేఖంగా ఈనెల 15న సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. తిక్కప్ప, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

తుగ్గలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలను రైతులు ఈకేవైసీ తప్పక చేయించాలని ఏవో సురేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ రైతులు పంటనమోదు చేయకపోతే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ అందవన్నారు.

నేడు వార్షికోత్సవం

ఆదోని టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు గంగాభవాని ఆలయ 75వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలుగు ఈరన్న తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ 1950లో విగ్రహ ప్రతిష్ఠ చేశారని, 75 సంవత్సరాల పాటు గంగపుత్రులు పూజలు నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం అభిషేకాలు, అర్చకులు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. తెలుగు ఈరన్న, మేఘనాథ్, ఆటో వెంకటేష్, బేల్దార్ శ్రీనివాసలు, దుల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 104 అంబులెన్స్ ఉద్యోగులు కోరారు. ఆదివారం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బి.విరుపాక్షికి వినతి పత్రం అందించారు. భావ్య హెల్త్ సర్వీసెస్ యాజమాన్యం నుంచి జీతాలు పెండింగ్ ఉన్నాయని, వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. మాజీ యాజమాన్యం అరబిందో సంస్థ నుంచి కూడా బకాయిలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట ప్రకారం రూ.10 లక్షల బీమా, పీఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సలువప్ప, బసవరాజు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

తుగ్గలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కృషి చేస్తామని విద్యాకమిటీ ఛైర్మన్ మిద్దె రవి కుమార్, తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు బాలన్న అన్నారు. ఆదివారం మాట్లాడుతూ జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అన్ని వసతులను సమకూరుస్తున్నామని, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ఇస్తామన్నారు.

కట్టారు.. వదిలేశారు

- నిరుపయోగంగా ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్



ప్రారంభానికి నోచుకోని భవనం ఇదే

మద్దికెర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో గత వైసీపీ హయాంలో రూ.22లక్షలతో ఆయుస్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాన్ని నిరించారు. గ్రామంలో 6వేల మంది ఉండగా, సిబ్బంది ఇద్దరు డాక్టర్లు, సిబ్బంది 6 మంది పనిచేస్తున్నారు. కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో మరోచోట నిర్వహిస్తున్నారు. ప్రహరీ లేదని చుట్టూ ముళ్లకంప, పిచ్చిమొక్కలు ఉండటంతోనే చేరడం లేదని వైద్యసిబ్బంది తెలుపుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ విష్ణువర్ధన్ మాట్లాడుతూ నిధులు మంజూరు కాగానే ప్రహరీ నిర్మిస్తామన్నారు.

'అన్నదాత పోరుబాట'కు తరలిరావాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పిలుపు మేరకు ఈనెల 9న నిర్వహించనున్న 'అన్నదాత పోరు బాట'కు రైతులు తరలిరావాలని ఎమ్మెల్యే విరుపాక్షి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో పోస్టర్లను విడుదల చేశారు. ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా రైతుల సమ స్యల పట్ల దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ఉల్లి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందు తున్నారన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫల మైందన్నారు. దేవనకొండ జడ్పీటీసీ రామకృష్ణ (కిట్టు), కన్వీనర్ మల్లికార్జున, షఫీవుల్లా, శేషప్ప, అర్థగేరి శ్రీనివాసులు, గోవర్ధన్, వెంకటేష్ ఉన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో టమాటా మార్కెట్‌లో రైతులతో మాట్లాడారు. వ్యాపారులు పది శాతం కమీషన్‌తో రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమ న్నారు. వెంటనే స్పందించకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



రైతులను విచారిస్తున్న క్రాంతినాయుడు

ఎరువులొచ్చాయి.. ఆందోళన చెందొద్దు

ఆదోని రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి కావలసిన ఎరువులు వచ్చాయని, రైతులు చెందొద్దని ఏవో సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆదోని రైల్వే వ్యాగన్ స్టాక్ పాయింట్‌కు ఐపీఎల్ కంపెనీ నుంచి 2,680 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఇందులో 1,875 టన్నుల మార్క్‌ఫెడ్ గోడౌన్‌కు 805 టన్నులు ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తామన్నారు. సమీప రైతు సేవా కేంద్రాల్లో తీసుకోవాలని ఏవో సూచించారు.



రైల్వే వాగన్ వద్ద స్టాకు పరిశీలిస్తున్న ఏవో

యాభై ఏళ్లకు కలిశారు

- 1973-74 పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో నెహ్రూ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల 1973-74 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అరే నువ్వు రామాంజినేయులు కదా ఎలా ఉన్నావ్? ఎమ్మెల్సీ శివరామిరెడ్డి బాగున్నావా? అంటూ మిత్రులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దాదాపు 34 మందికి పైగా కలవడంతో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. నాటి ఉపాధ్యాయులు దస్తగిరి, శ్రీనివాస్ రావు, నాగరాజు, ప్రస్తుత హెచ్ఎం ఫయాజ్‌ను సన్మానించారు. ఎమ్మెల్సీ శివరామి రెడ్డి సీపీఎం నాయకుడు రామాంజనేయులు రెహమాన్ మాట్లాడుతూ టీచర్లను సన్మానించడం సంతోషమన్నారు.

అలా వదిలేశారు!

- హొళగుందలో నిరుపయోగంగా హాస్టల్ భవనం, మందుబాబుల అడ్డా





హాస్టల్ భవనం ఇదే, ఇన్‌సెట్‌లో మద్యం సీసాలు

హొళగుంద, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజానగర్ కాలనీలో సమీపంలో 2016లో ఎస్సీ బాలుర హాస్టల్ భవనం నిర్మించారు. అయితే రెండేళ్లకే విద్యార్థులు లేరన్న సాకుతో ఎస్సీ బాలుర హాస్టల్‌ను 2018లో ఎత్తివేశారు. అనంతరం దీన్ని మరో కార్యాలయానికి, పాఠశాలకు ఉపయోగించకుండా వదిలేశారు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం కాస్తా శిథిలావస్థకు చేరుతోంది. రాత్రిళ్లు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. విలువైన భవనాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడం పట్ల విద్యావేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హాస్టళ్ల భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

'రైతు సమస్యలపై పోరాటం'


పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సెప్టెంబర్ 9న ఆదోని ఆర్డీవో కార్యాలయం ఎదుట అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి వైసీపీ ఎమ్మిగనూరు ఇంచార్జి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివార ం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రైతులు కొన్ని నెలలుగా యూరియా కోసం క్యూల్లో నిలబడి రోజంతా పడిగాపులు కాస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటకు ఆర్థిక సాయం ఇవ్వాలని, రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9వ తేదిన ఆదోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శాంతి నిరసన ర్యాలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైసీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ, మునిసిపల్ చైర్మన్ రఘు, వీరుపాక్షీ రెడ్డి, నాగేషప్ప, కొటకొండ నరసింహులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు


కోసిగిలో మాట్లాడుతున్న ఏవో వరప్రసాద్

కోసిగి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా గురించి మండలంలోని రైతులు ఎవరూ ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. ఆదివారం కోసిగిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోసిగిలోని అన్ని ఎరువుల దుకాణాల్లో, రైతు సేవా కేంద్రాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉందని, ఎవరూ కూడా రైతులు యూరియా గురించి ఆందోళనలు చెందవద్దని సూచించారు. కోసిగిత మండలంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల డీలర్ల వద్ద 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే ఇప్పటి వరకు కోసిగి మండలంలో 1875 మెట్రిక్ టన్నుల యూరియా మార్కెట్ గోడౌన్‌కు, 805 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే రైతులు వేసిన పంటలను నమోదు చేసుకునేందుకు రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరగా పంట నమోదును పూర్తి చేసుకోవాలని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రాలయం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం లోని వి.తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ నరసింహాలు (47) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, సర్పంచ్ వీరారెడ్డి మృతదేహనికి నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా రాంపురం రెడ్డి కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని బరోసా ఇచ్చారు.మట్టి ఖర్చులకు రూ.10 వేలు నగదును అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురంధరదాసు, పాండు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సేవా పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ కార్యకర్తలకు జిల్లా కార్యదర్శి, పట్టణ ఇంచార్జి దయాసాగ ర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదిన భారత ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని ఆక్టోబర్ 2వ తేదిన గాంధీ జయంతి లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వరకు చేపట్టబోయే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రే ణులకు, కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చిందన్నారు. సీనియర్ నాయకులు లలిత్ జైన్, బి ఎల్ నారాయణ, జెట్టప్ప, శిల్పి భాస్కర్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకు రిమాండ్

కోసిగి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్తలైన పరుసాని నరసన్న, దుర్నిగేని వెంకన్న, నాగిరెడ్డిలపైన అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కోసిగి హనుమంతు, కోసిగి నరుసప్ప, వాచ్‌మెన్స్ రాముడు, వెంకటేష్ అలియాస్ దొరగాడు ఈ నలుగురు కలిసి రెండు మోటారు సైకిళ్లపై అటకాయించి ఎరుకలి కొడవలి, ఇనుపరాడ్డుతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 3వ తేదీ కోసిగి సమీపంలోని ఆదోని రోడ్డులో టీడీపీ కార్యకర్తలు పరుసాని నరసన్న, దుర్నిగేని వెంకన్న, నాగిరెడ్డి టీడీపీ సంబంధించి ఫొటోలు, వీడియోలు తమ వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నారని, వైసీపీ చెందిన ఈ నలుగురు కార్యకర్తలు మోటారు సైకిళ్లపై అడ్డగించి కొడవలి, రాడ్డుతో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డారని అన్నారు. ఫిర్యాదుదారుడు నరసన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో బాగంగా ఆదివారం సాయంత్రం కోసిగిలోని పండేసిన గుండు రస్తాలో వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేసి దాడులకు ఉపయోగించిన బైకులు, కొడవలి, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పదోన్నతులు ఇవ్వాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తెలుగు, హింది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు గోట్ల చంద్రశేఖర్, ఈశ్వర రెడ్డి, చిన్న వీరేష్, రంగస్వామి పాల్గొన్నారు.

ఆలయం మూసివేత


ఆలయం తలుపులు మూసివేసిన దృశ్యం

కౌతాళం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రము ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ తలుపులు సంపూర్ణ చంద్రగ్రహణం ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం 1గంటకు ఆలయ అర్చకులు, ఆలయ అధికారుల సమక్షంలో ఆలయ తలుపులు మూసివేశారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం తలుపులు మూసి తిరిగి గ్రహణం పూర్తి అయిన తరువాత సోమవారం తెల్లవారుజామున ఆలయ సంప్రోక్షణ చేపట్టి భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు.

ప్రమాదకరంగా మలుపులు

- కనిపించని స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు
- ప్రమాదానికి గురువుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


గోనెగండ్ల వీవర్స్ కాలనీ దగ్గర ఉన్న ప్రమాదకర మలుపు


చదువుల రామయ్య కాలనీ దగ్గర రెండు బస్సులు ఢీకొన్న దృశ్యం(ఫైల్)


భారత్ గ్యాస్ గోడౌన్ క్రాస్ రోడ్డు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన అంబులెన్స్ (ఫైల్)

గోనెగండ్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రధాన రహదారిలో ఉన్న మలుపుల దగ్గర ప్రమదాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం గోనెగండ్ల గ్రామ శివార్లలోని భారత్ గ్యాస్ గోడౌన్ దగ్గర అంబులెన్స్, మహారాష్ట్రకు చెందిన ఉల్లిగడ్డల లారీ ఢీ కొన్న ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. నెల రోజుల క్రితం బాటమారెమ్మ దేవాలయ మలుపు దగ్గర స్కూటర్ కారు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గత ఆరు మాసాల క్రితం వేముగోడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ అనే వ్యక్తి మృతిచెందాడు. గత ఆరుమాసాల క్రితం పెద్దనేలటూరు, హెచ్ కైరవాడి గ్రామాల మధ్య ఎల్లెల్సీ కాలువ మలుపు దగ్గర రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దనేలటూరు గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. ఇలా మలుపుల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎన్నో. అలాగే గత ఏడాది మంత్రాలయం రోడ్డు లోని హలహర్వి దగ్గర ముగ్గురు, ధర్మాపురు దగ్గర ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇలా ప్రతి రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత కొన్నెళ్లుగా మలుపుల దగ్గర ప్రమాదకర సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకులు లేక పోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల వద్ద అజాగ్రత్త, అతివేగం, తొందరతనంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదకర బోర్డులను స్పీడ్ బ్రేకులను ఏర్పాటు చేయడం లేదని ప్రయాణీకులు వాపోతున్నారు. అలాగే గత ఏడాది క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర క్రాస్‌రోడ్డును ద్విచక్రవాహనం దాటుతుండగా ఎమ్మిగనూరు వైపు నుంచి ఆర్‌టీసీ బస్సు ద్విచక్రవాహనంను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో చాలా జరిగాయి. అయినప్పటికి ఈ ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాదకరసూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల కేంద్రమైన గోనెగండ్ల లోని వీవర్స్ కాలనీ దగ్గర ఉన్న మలుపులు, చదువుల రామయ్య కాలనీ, గంజహళ్లి క్రాస్ రోడ్డ దగ్గర ఉన్న మలుపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. వీవర్స్ కాలనీ దగ్గర ఉన్న మలుపు వద్ద నెలలో ఒక మారు తప్పని సరిగా రోడ్డు ప్రమాదం జరుగుతునే ఉంటుంది. గత మూడేళ్ల క్రితం చదువుల రామయ్య కాలనీ దగ్గర ఉన్న మలుపు వద్ద రెండు అర్‌టీసీ బస్సులు ఢీ కొన్నప్రమాదంలో 10 మందికి గాయాలు అయ్యాయి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు దగ్గర ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఏడాది క్రితం బోరుబండి బోల్తా పడ్డసంఘటనలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. గత ఎడాది గోనెగండ్ల కు చెందిన ఓ వ్యక్తి, గూడురు కు చెందిన భాషా అనే యువకుడు ద్విచక్రవాహ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. గత రెండేళ్ల క్రితం గోనెగండ్ల కు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఇదే క్రాస్‌రోడ్డు దగ్గర అటో ప్రమాదంలో మృతిచెందారు. గోనెగండ్లలోని గంజహళ్లి క్రాస్ రోడ్డు దగ్గర గత రెండేళ్ల క్రితం బాషా అనే వ్యక్తి ద్విచక్రవాహనం పై రోడ్డును దాటు తుండగా ఆర్‌టీసీ బస్సు ఢీ కొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. గంజహళ్లి గ్రామ శివార్లలో ఉన్న మలుపు దగ్గర స్కూల్ బస్సును స్కూటర్ ఢీ కొన్న ప్రమాదంలో గంజహళ్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కటిక ఉసేన్‌వలి అనే వ్యక్తి తన ద్విచక్రవాహనం పై రోడ్డు దాటు తుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. గంజహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న మలుపు కూడా చాల ప్రమాదకరంగా ఉంది. ప్రతి ఎడాది ఈ ప్రాంతంలో కనీసం రెండు రోడ్డు ప్రమాదాలైనా జరుగుతుంటాయి. అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదకర బోర్డులను స్పీడ్ బ్రేక్‌లను వేయాలని ప్రమాణీకులు కోరుతున్నారు.

కెపాసిటీకి మించి వాహనాల్లో ప్రయాణం

ప్రవేట్ వాహనాల్లో కెపాసిటిని మించి ప్రయాణీకులను ఎక్కించుకొని ప్రయాణం చేయడం, మలుపుల వద్ద బండి అదుపులోని రాక పోవడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రవేట్ వాహనాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రమాదకర మలుపుల వద్ద అర్‌అండ్‌బీ అధికారులు మలుపును సూచించే బోర్డులను ఎర్పాటు చేయాలి. అవసరమైన చోట స్పీడ్ బ్రేకులు వేయాలి. దీంతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.

- గంజల్లయ్య, గంజహళ్లి గ్రామం

అభివృద్ధిని ఓర్వలేని వైసీపీ

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు న్యాయం చేస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు బురద చల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ హిట్‌కావడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు అభివృద్ధి ఒకవైపు సంక్షేమం చేస్తున్న ముఖ్యమంత్రా నారా చంద్రబాబునాయుడుపై ఏమీచేయలేక రైతుల పేరుతో డ్రామా ఆడుతూ ఉల్లిరైతులను ఆదుకోవడంలో విఫలం అయిందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ రైతులతో పురుగుమందు డబ్బాలో మద్యంపోసి తాగించి వైసీపీ కార్యకర్తలు కృష్ణ, వెంకట్‌లు ఉల్లిరైతులమంటూ ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫ్ వీడియోలు తీసి రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు సిగ్గుచేటని అన్నారు వైసీపీ నాయకుల చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.ఈసమావేశంలో టీడీపీ నాయకులు, సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహలు పాల్గొన్నారు.

యువత కోసిగి పేరును నిలబెట్టాలి


హనుమంతరెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌ఐ, టీడీపీ నాయకులు రామిరెడ్డి

కోసిగి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాదించి కోసిగి పేరును ఉన్నత స్థానంలో నిలబెట్టాలని కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో కోసిగిలోని 6వ వార్డు చెందిన వ్యవసాయ కూలీ నాడిగేని కోసిగయ్య, ఈరమ్మ దంపతుల కుమారుడు నాడిగేని హనుమంతరెడ్డి అనే యువకుడు సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపిక కావడంతో ఆదివారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ హనుమంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి శాలువ, పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి మండలంలో యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి కోసిగి పేరును రాష్ట్ర జిల్లా స్థాయిలో నిలబెట్టాలన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందోద్దని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏఓ శివశంకర్‌లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ కు 200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. నందవరం మండలంలోని నాగలదిన్నేకు 12.6మెట్రిక్ టన్నులు, మన అగ్రిస్టోర్ష్ నందవరంకు 12.3మెట్రిక్ టన్నులు, హాలహర్వికి 12.6, గురుజాలకు 12.6, కనకవీడుకు 12.6 మెట్రిక్ టన్నులు, మంత్రాలయం మండలానికి 24.12 మెట్రిక్ టన్నులు, గోనేగండ్ల మండలంకు 48.24 మెట్రిక్ టన్నులు, ఎమ్మిగనూరు మండలంలకు 36.9మెట్రిక్ టన్నులు, ఎమ్మిగనూరు పట్టణానికి 100 మెట్రిక్ టన్నులు యూరియ వచ్చిందన్నారు. రైతులు ఎవరు ఆందోలన చెందాల్సిన అవసరం లేదని, అవసరం మేరకు యూరియా రైతులు కొనుగోలు చేసుకోవాలనా సూచించారు.

ప్రభుత్వంపై నిందలు వేసేందుకే వైసీపీ డ్రామాలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్న కూటమి ప్రభుత్వంపై నిందలు వేసేందుకే వైసీపీ నాయకులు ఉల్లిరైతులను అడ్డుపెట్టుకొని డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేదంటూ వైసీపీ పార్టీకి చెందిన ఇద్దరు రైతులతో ఆపార్టీ నాయకులే విషం తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియోలు రికార్డు చేయటం ఆపార్టీ నాయకుల దగాకోరు తనానికి నిదర్శనమన్నారు. ఖాళీ పురుగు మందు సీసాలో మద్యం కలుపుకొని ఆ మద్యాన్ని తాగి ప్రభుత్వంపై ఆరోపణలు చేయటం కాస్తా ఆసుపత్రిలో బయట పడిందన్నారు. రాజకీయ మనుగడకోసమే వైసీపీ నాయకులు ఈ డ్రామాలకు తెరలేపరన్నారు. సీఎం చంద్రబాబు ఉల్లి రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉల్లికి గిట్టుబాటు ధర రూ. 1200లు కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలే కాని ఇలా కుట్ర రాజకీయాలు చేయొద్దని, చేసిన ప్రజలు నమ్మె పరస్థితిలో లేరన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో మహిళలకు, రైతులకు, చేనేతలకు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ఏదో విధ ంగా కూటమి ప్రభుత్వంపైన, సీఎం చంద్రబాబు నాయుడుపై విషం చిమ్ముతూ ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. విషప్రచారాలు చేస్తే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు


బంగారు రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహంను పురష్కరించుకొని మధ్యహ్నానికే పూజలు ముగించారు. ఉదయమే ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, గజ, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై విహరించారు. చంద్రగ్రహణంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచి పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి రథాలను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగాణ ం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవలో స్వామివారిని ఊగించారు.పూర్ణబోధ పూజమందిరంలో మూలరాములు, జయరాములు,దిగ్విజరాములకు పీఠాధిపతి కనకాభిషేకం చేశారు. మధ్యహ్నానానికి పూజలు ముగియడంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు పగటిపూట రథోత్సవాల్లో తరించారు. మధ్యాహ్నానికే అన్నదానం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు.

నేడు పీఠాధిపతుల చతుర్మాస దీక్ష విరమణ : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు 49 రోజులతో పాటు చేపట్టిన 13వ ఛాతుర్మాస దీక్షలు నేటి సోమవారం విరమించుకోనున్నారు. జూలై 22వ తేదీన అట్టహాసంగా మంత్రాలయంలో తన 13వ చాతుర్మాస దీక్షను స్వీకరించారు. 49 రోజులుగా మంత్రాలయం సరిహద్దులు దాటకుండా మంత్రాలయంలోనే ఉంటూ భక్తులకు అందుబాటులో ఉండి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన సోమవారం దీక్ష విరమించుకోనుండటంతో సీముల్లంఘన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూరి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

13న దళితుల సమ్మేళన సభ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహా డిమాండ్ల సాధన కోరకై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 13వ తేదిన దళితుల సమ్మేళన సభను నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న తెలిపారు. దేవసహాయం, ఆనంద్, బాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు వైసీపీ అడ్డుకట్ట: టీడీపీ

నందవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నందవరంలో టీడీపీ హయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు వైసీపీ నాయకులు అడ్డుకట్టా వేస్తూనే ఉన్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాదవరావు ఆరోపించారు. అదివారం ఆయన వైసీపీ నాయకులు తొలగించిన బోరును పరిశీలించారు. కార్యక్రమంలో బెస్తా ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియను ప్రారంభించాలి


మాట్లాడుతున్న ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారుల పెన్షన్ల అన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి కరుణాకర్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ డప్పు కళాకారుల పెన్షన్ అన్‌లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, డప్పు పెన్షన్ దరఖాస్తు వయస్సు 45 సంవత్సరాలకు తగ్గించి, పెన్షన్‌ను రూ 7వేలకు పెంచాలని అన్నారు. ఏపీడీకేఎస్ గోనెగండ్ల నూతన మండల కమిటీకి మండల అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా దేవరాజు, కార్యదర్శిగా అనంద్, కోశాదికారిగా తిమ్మన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. ఈ కార్యక్రమంలో రాజా రమేష్, చిన్నప్ప, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం


పీఠాధిపతి మర్రిస్వామి తాతను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి

కోసిగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):అన్నదానమే మహాదానమని ఆర్లబండ మఠం పీఠాధిపతి మర్రిస్వామి తాత అన్నారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో వెలసిన సద్గురు జోయిషీ కృష్ణమ్మవ్వ పుణ్యాశ్రమంలో కోసిగి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఆర్లబండ మఠం పీఠాధిపతి మర్రిస్వామి తాతకు భారీ గజమాలతో, శాలువలతో సన్మానం చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి ఆశిస్సులు అందుకుని భక్తుల సమక్షంలో పల్లెపాడు రామిరెడ్డికి పూలమాలలు, శాలువాతో పీఠాధిపతి సన్మానించారు. భక్తులు దైనందిన జీవితం గడపాలని, మానసిక ప్రశాంతతకు మించిన మానవునికి వేరేది ఏదీ లేదని పీఠాధిపతి పేర్కొన్నారు.